సాక్షి
అనకాపల్లి
బుధవారం । 15 । మే । 2024



సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

విశాఖ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



క్రీడాకారుడికి సత్కారం

విశాఖ: ప్రముఖ క్రీడాకారుడు, కేజీహెచ్ ఉద్యోగి నీలాపు శ్రీనివాసరావును ఇటీవల ఢిల్లీలో ఘనంగా సత్కరించారు.

గరిష్టం/కనిష్టం
35.6/24.0

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

ఏపీఆర్ఎస్ ఫలితాల్లో పిండ్రంగి విద్యార్థికి మొదటి ర్యాంక్



మల్లవరపు కీర్తి (99/100)

కె.కోటపాడు: ఏపీఆర్ఎస్‌లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలో కె.కోటపాడు మండలం పిండ్రంగి గ్రామానికి చెందిన మల్లవరపు కీర్తి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఏపీఆర్ఎస్ ఎంట్రన్స్ పరీక్షను గత నెల 25న నిర్వహించారు. ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ పరీక్షలో 100కి 99 మార్కులు పొందిన కీర్తి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించింది. పిండ్రంగి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కీర్తి చదువుతోంది. ఆమె తండ్రి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో కీర్తి మొదటి ర్యాంక్ సాధించడం పట్ల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బాదిరెడ్డి దేవి, హెచ్‌ఎం బంగారునాయుడు, రమేష్, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

9 మంది ట్రైనీ ఐపీఎస్‌లకు ఎస్పీ అభినందన



ట్రైనీ ఐపీఎస్‌లతో ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని పర్యవేక్షించిన నేషనల్ పోలీస్ అకాడమీకి చెందిన తొమ్మిది మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులను కేవీ మురళీకృష్ణ అభినందించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకూ ఎన్నికల నిర్వహణను వీరు పర్యవేక్షించారన్నారు. ఇందులో భాగంగా పోలింగ్ రోజు బందోబస్తు ఏర్పాట్లు, బలగాల సమీకరణ, భద్రత సమస్యలు, సివిల్, పోలీస్ పరిపాలన విషయాలపై వివరించామన్నారు. జిల్లా పోలీసులు, పారామిలటరీ దళాలతో కవాతు, సెక్టార్ మొబైల్ ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా, పోలీస్ కంట్రోల్ రూమ్, చెక్‌పోస్టులు, పోలింగ్ బూత్, కౌంటింగ్ సెంటర్లకు ఈవీఎం తదితర అంశాలపై అవగాహన పొందారన్నారు. అనంతరం ట్రైనీ ఐపీఎస్‌లను శాలువాతో సత్కరించారు. అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు మోహన్, ఎం.దహిఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడికి ఓటు వేశా...

మునగపాక: ఏమ్మా ఓటు వేశావా.. ఆ వేశా.. ఎవరికి వేశావు.. ఇంకెవరికీ దేవునికి.. మండలంలోని అరబుపాలెంలో ఓ మహిళ తన మనసులో మాట ఇలా వ్యక్తం చేసింది. చేసిన మేలును గుర్తుంచుకోకపోతే ఇంకెందుకు.. అని కూడా ఆమె ప్రశ్నించింది. ఈ గ్రామానికి చెందిన మహిళ మంగళవారం నడుచుకుంటూ మునగపాక వైపునకు వస్తోంది. ఆ సమయంలో అటుగా పోతున్న మరో మహిళ 'నిన్న ఓటు వేశావా' అని అడగడంతో 'ఆ వేశానమ్మా.. దేవునికే వేశాను' అంటూ ఆమె బదులిచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దృష్టిలో పెట్టుకొని ఆమె ఆ మాట అంది. జగన్ బాబు దయ వలన ఎంతోమంది లబ్ధి పొందుతున్నా.. కొంతమంది చేసిన మేలును గుర్తుంచుకోకపోవడం సరికాదంటూ ఆమె పేర్కొంది. సీఎం జగన్ ప్రజల మనసుల్లో ముద్ర వేసుకున్నారనడానికి ఇంతకంటే ఉదాహరణ ఇంకేం కావాలి.

ఇస్కాన్‌లో ప్రారంభమైన ఐవైసీ సమావేశాలు



ప్రసంగిస్తున్న కమల్ లోచన్ ప్రభూ

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో మూడు రోజుల పాటు జరిగే ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్(ఐవైసీ) సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని కమల్ లోచన్ ప్రభు తెలిపారు. ఆధ్యాత్మిక భావనలు, సనాతన ధర్మం విశిష్టతను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా విశాఖ సాగర తీరంలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు హరినామ సంకీర్తన నిర్వహించారు. మూడు రోజుల పాటు భాగవత ప్రవచనాలు, ప్రతి రోజూ ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధేశ్యామ్ ప్రభూ, ఇస్కాన్ అధ్యక్షుడు సాంబా దాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన చైతన్యం

- సాయంత్రం వేళలో పోటెత్తిన ఓటర్
- ప్రభుత్వ అనుకూల ఓటు కోసం బారులు తీరిన ప్రజలు
- ఇదే అధికార పక్షం విజయానికి కీలకం



అచ్యుతాపురంలో సోమవారం కిటకిటలాడుతున్న పోలింగ్ కేంద్రం

సాక్షి, అనకాపల్లి: జిల్లా ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గత ఎన్నికల్లోలాగే ఈసారి కూడా భారీ పోలింగ్ నమోదైంది. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించిన రాజకీయ పక్షాలు.. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా ప్రోత్సహించాయి. ఓటు విలువను తెలుపుతూ ఎన్నికల కమిషన్ నిర్వహించిన ప్రచారం కూడా పోలింగ్ పెరిగేందుకు దోహదపడింది. 2019 ఎన్నికల్లో 82.32 శాతం భారీ పోలింగ్ నమోదు కాగా ఈసారి స్వల్పంగా పెరిగి 82.66 శాతం నమోదైంది. అత్యధికంగా మాడుగులలో 86.02 శాతం, అత్యల్పంగా అనకాపల్లిలో 74.64 శాతం నమోదైంది. జిల్లా పరిధిలో ఒక్క నియోజకవర్గం మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024లో చోడవరంలో 0.18 శాతం పెరిగింది. మాడుగులలో 2.35 శాతం, యలమంచిలిలో 1.17 శాతం, పాయకరావుపేటలో 0.28 శాతం, నర్సీపట్నంలో 1.16 శాతం పోలింగ్ పెరగ్గా.. అనకాపల్లిలో మాత్రం 2.9 శాతం తగ్గింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మందకొడిగా సాగిన పోలింగ్ ప్రక్రియ.. 4 తరువాత పెరిగింది. రాత్రి 8 గంటల సమయానికే 69.03 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 8 నుంచి 11 గంటల మధ్య 13.57 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలో 12,89,371 లక్షల ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలు 6,62,022 మంది మహిళలు గానూ 5,46,013 నమోదైంది. 6,27,321 మంది పురుషులకు గానూ 5,19,792 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ సరళి..

మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆ ప్రభావం పోలింగ్‌పై పడింది. దాదాపు మూడు గంటల వరకు ఆ ప్రభావం కన్పించింది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఓటర్లు భారీగా బూత్‌లకు తరలి వచ్చారు. దాదాపు 60 శాతం బూత్‌ల వద్ద వందలు, వేలల్లో ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో కేవలం 8.47 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. 9 గంటల నుంచి 11 గంటల మధ్య రెట్టింపు కన్నా ఎక్కువగా 19.97 శాతం నమోదైంది. మధ్యాహ్నం 1 గంటకు 37.83 శాతం, 2 గంటల సమయానికి 53.45 శాతం నమోదైంది. సాయంత్రం 4 గంటలకు 58.11 శాతం, సాయంత్రం 6 గంటల వరకూ 69.03 శాతం నమోదైంది. రాత్రి 8 గంటల వరకూ 69.67 శాతం, రాత్రి 8 నుంచి పోలింగ్ ముగిసే సమయం వరకూ 13.57 శాతం పోలింగ్ నమోదైంది.

జిల్లాలో మొత్తం ఓటర్లు	12,89,371
పోలైన ఓట్లు	10,65,821
పోలింగ్ శాతం	82.66
మాడుగులలో అత్యధికం	86.02 శాతం
అనకాపల్లిలో అత్యల్పం	74.64 శాతం
ఓటింగ్ పెరుగుదల	0.34 శాతం



యలమంచిలిలో బారులు తీరిన ఓటర్లు

ఓటుతో పోటెత్తిన మహిళలు

కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించేలా సాగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు చైతన్యం ప్రదర్శించారు. గతేడాది కంటే ఈ ఏడాది మహిళా ఓటర్ల సంఖ్య పెరగడమే కాక.. పోలింగ్ శాతం కూడా పెరిగింది. పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరి తమ చేతిలో ఉన్న వజ్రాయుధంలాంటి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు మేలు జరగడంతో వారు వైఎస్సార్‌సీపీకే భారీ ఎత్తున పట్టం కట్టినట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది 22,025 మంది మహిళా ఓటర్లు పెరిగారు.

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో

మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
15,96916	12,73,920

ఓటింగ్ శాతం 79.77 %

2019లో ఓటింగ్ శాతం 81 %

2024లో అనకాపల్లి జిల్లాలో ఓటింగ్ జరిగిందిలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	స్త్రీలు	పురుషులు	శాతం
చోడవరం	2,17,484	1,83,643	94,733	88,908	84.44
మాడుగుల	1,88,989	1,62,577	83,663	78,914	86.02
అనకాపల్లి	2,13,714	1,59,523	82,634	76,878	74.64
యలమంచిలి	2,06,394	1,76,807	90,492	86,315	85.66
పాయకరావుపేట	2,50,744	2,05,671	1,03,686	1,01,985	82.02
నర్సీపట్నం	2,12,016	1,77,600	90,805	8,6792	83.76
మొత్తం	12,89,371	10,65,821	5,46,013	5,19,792	82.66
పెందుర్తి	3,07,545	2,08,099	1,06,641	1,01,454	67.66
పార్లమెంట్	15,96,916	12,73,920	6,52,654	6,21,246	79.77

పోలింగ్ శాతం ఎప్పుడు ఎంత..

నియోజకవర్గం	2014	2019	2024
చోడవరం	82	84.26	84.44
మాడుగుల	78	83.67	86.02
అనకాపల్లి	82	77.54	74.64
యలమంచిలి	86.43	84.49	85.66
పాయకరావుపేట	73	81.74	82.02
నర్సీపట్నం	81	82.60	83.76
సగటు	80.04	82.32	82.66

ఓటుతో పోటెత్తిన మహిళలు

నియోజకవర్గం	2019	2024	పెరిగిన ఓట్లు
చోడవరం	91,339	94,733	3,394
మాడుగుల	79,487	83,663	4,147
అనకాపల్లి	81,496	82,634	655
యలమంచిలి	83,979	90,492	6,513
పాయకరావుపేట	98,786	1,03,686	4,900
నర్సీపట్నం	88,901	90,805	1,904
మొత్తం	5,23,988	5,46,013	22,025

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం

స్ట్రాంగ్ రూముల్లో భద్రం

తుమ్మపాల: జిల్లాలో ఆరు అసెంబ్లీ, అనకాపల్లి లోక్‌సభ పరిధిలోని ఈవీఎంలన్నీ స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరాయి. మొత్తం 1,529 పోలింగ్ కేంద్రాల్లో గల ఈవీఎం బాక్స్‌లను అనకాపల్లి ఎస్పీ కార్యాలయం సమీపంలో గల ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు పోలింగ్ సిబ్బంది సోమవారం రాత్రి తీసుకువచ్చారు. మంగళవారం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో అధికారులు, అభ్యర్థుల సమక్షంలో భద్రపరిచారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, సాధారణ ఎన్నికల పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్, మోహన్ ఎం.దహిఖర్‌లతో పాటు పోటీచేసిన పార్లమెంట్, అసెంబ్లీల అభ్యర్థులు పరిశీలించిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచిన రూమ్‌లకు సీల్ వేశారు. కేంద్ర బలగాలతో నిరంతరం నిఘా ఉంటుందని, అభ్యర్థులకు ఎటువంటి అనుమానాలు వచ్చినా అందరి సమక్షంలో తనిఖీ చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈవీఎంల భద్రత, అనుమానాలు, కౌంటింగ్ తేదీ వరకు భద్రతపై తీసుకుంటున్న అంశాలను అభ్యర్థులకు వివరించారు.

కేంద్ర బలగాలతో మూడంచెల భద్రత

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెలలో కేంద్ర పోలీసు బలగాలు నిరంతరం గస్తీ నిర్వహించనున్నాయి. ప్రతి రోజు 24 గంటల పాటు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తారు. కేంద్ర బలగాలతో పాటు జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. స్ట్రాంగ్ రూమ్‌కి నలువైపులా పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కె.వి. మురళీకృష్ణ, తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న అవాంఛనీయ సంఘటనకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలన్నారు. కౌంటింగ్ తేదీ వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే అవకాశం లేకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు అప్పటి వరకు సంయమనం పాటించాలని, ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే పోలీసుకు తక్షణం సమాచారం అందించాలని కోరారు.



కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న సిబ్బంది



కేంద్ర బలగాల గస్తీని పరిశీలిస్తున్న ఎస్పీ కెవి.మురళీకృష్ణ

వచ్చే నెల 29న మెగా లోక్ అదాలత్

విశాఖ లీగల్:

మెగా లోక్ అదాలత్ జూన్ 29వ తేదీన నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులోని నూతన భవనం సమావేశ మందిరంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో రాజీ కలిగిన పెండింగ్ కేసులను పరిష్కరిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇందులో రాజీ కలిగిన క్రిమినల్ సివిల్ కేసులు పారశిక్షాస్మృతి పరిధిలోని అన్ని కేసులు, చెల్లని చెక్ కేసులు, సివిల్ తగాదాలు, బ్యాంకింగ్, బీమా కంపెనీలు, రాజీ కాగలిగిన కేసులు, విశాఖలోని కేంద్ర కార్యాలయాలు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోర్టు, హిందుస్థాన్ షిప్ యార్డ్, విశాఖ స్టీల్ ప్లాంట్, వివిధ ప్రైవేట్ రంగ సంస్థలు తమ కేసులను రాజీ చేసుకోవచ్చని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

కుటుంబ న్యాయస్థానం సంబంధించి కొన్ని కేసులు మాత్రమే రాజీ చేస్తామన్నారు. అన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తితో పాటు న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎంవి శేషమ్మ, మెట్రోపాలిటీ సెషన్ జడ్జ్ ఎం.వెంకటరమణ, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం ఉమ్మడి జిల్లాలో చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీకి ఎక్సలెన్స్ అవార్డు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం మూడో పర్యాయం పర్యావరణ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంది. సింహాద్రి ఎన్టీపీసీ అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్(న్యూఢిల్లీ) ఈ నెల 4న గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డు-2023ను ప్రదానం చేసింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు సింహాద్రి ఎన్టీపీసీ మూడవ సారి ఎంపిక కావడం విశేషం. పచ్చదనం, పరిశుభ్రమైన పర్యావరణానికి కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కిందని ఎన్టీపీసీ ప్రతినిధులు తెలిపారు.

పోలింగ్ అధికారులు, పోలీసుల పక్షపాత ధోరణి

- బోయిలకింతాడలో ఇద్దరు ఓటర్లకు అనుమతి నిరాకరణ
- దేవరాపల్లిలో టీడీపీకి అనుకూలంగా కానిస్టేబుల్ తీరు
- ఎ. కొత్తపల్లిలో జనరేటర్ ఆపి విద్యుత్ సరఫరా నిలుపుదల



దేవరాపల్లిలో పోలీస్ కానిస్టేబుల్ పక్షపాతంగా వ్యవహరించిన పోలింగ్ బూత్

దేవరాపల్లి: పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులు, పోలీసులు పూర్తిగా పక్షపాత ధోరణి ప్రదర్శించారు. మండలంలోని బోయిలకింతాడ, ఎ.కొత్తపల్లి, దేవరాపల్లి పోలింగ్ బూత్‌ల్లో టీడీపీ, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించి ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడిచారు. ఎ. కొత్తపల్లిలో వృద్ధురాలు ఫ్యాన్‌కు ఓటు వేయాలని కోరగా, పోలింగ్ అధికారి కమలం గుర్తుకు ఓటేశారు. వృద్ధురాలు సహా పోలింగ్ ఏజెంట్లు నిలదీశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో తక్షణమే సదరు అధికారిని విధుల నుంచి తొలగించారు. ఇదే మాదిరిగా బోయిలకింతాడలో పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు టీడీపీ, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారు. టీడీపీ ఏజెంట్ల చెప్పే మాటలను మాత్రమే పరిగణనలోకి తీసుకోని వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారు. సాయంత్రం 6 గంటల లోపు ఎంత మంది ఉంటే అందర్నీ ఓటింగ్ వేయించాల్సి ఉంది. ఆ సమయానికే వచ్చిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఇద్దరు ఓటర్లను టీడీపీ ఏజెంట్లు ఒప్పుకోలేదని ఓటింగ్‌కు అనుమతించలేదు. దీనిపై పోలింగ్ ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దేవరాపల్లి 129 పోలింగ్ బూత్‌లో కానిస్టేబుల్ సైతం టీడీపీ అనుకూలంగా వ్యవహరించారు. ఆ పార్టీ నాయకులు పోలింగ్ బూత్ బయట ప్రచారం చేస్తున్నా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించి టీడీపీ పట్ల తన స్వామిభక్తిని చాటుకున్నాడు.

చీకట్లో ఈవీఎం మిషన్‌లతో అధికారులు..

ఎ. కొత్తపల్లిలోనూ పోలింగ్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. ఇక్కడ పోలింగ్ పూర్తయ్యాక ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను సీల్ చేస్తుండగా జనరేటర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపేశారు. దాంతో అరగంటకు పైగా ఈవీఎం మిషన్లతో చీకట్లో భయం భయంగా గడిపారు. ఇదంతా టీడీపీకి చెందిన జనరేటర్ యజమాని దురుద్దేశంగా గుర్తించి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఆగ్రహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఫిర్యాదుతో మరలా జనరేటర్‌ను ఆన్ చేయించి సరఫరా పునరుద్ధరించారు. స్థానిక వీఆర్వో నిర్లక్ష్య వైఖరితోనే ఈ ఘటన జరిగిందని ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాయ్ రాజా కాయ్

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం
- రూ.లక్షల నుంచి కోట్లలో బెట్టింగులు
- కొన్నిచోట్ల పందేనికి భూములు కూడా..
- తేడా రాకుండా ఇరువర్గాల అగ్రిమెంట్లు
- ఓటమి భయంతో కూటమి నాయకుల వెనకడుగు



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ ప్రభంజనం స్పష్టం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావడం ఖాయమన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. సోమవారం జరిగిన పోలింగ్ సరళితో పాటు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వివిధ సంస్థలు జరిపిన సర్వేల్లో వైఎస్సార్‌సీపీకే ఓటర్లు పట్టం కట్టబోతున్నారని ఇప్పటికే తేటతెల్లం చేశాయి. దీంతో గెలుపుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు పలువురు పందాలకు ముందుకొస్తున్నారు. పల్లెల్లోనే కాదు పట్టణాల్లోనూ భారీగా బెట్టింగులకు దిగుతున్నారు. పందాలపై ఆసక్తి ఉన్న వారు రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో ఏ పార్టీకి అనుకూలంగా ఓట్లు పోలయ్యాయన్న దానిపై సోమవారం సాయంత్రం నుంచే తమకున్న పరిచయాలు, ఇతర మార్గాల ద్వారా ఆరా తీయడం మొదలు పెట్టారు. ఏ ప్రాంతంలో, ఏ వర్గం ఓట్లు ఎంతమేర ఎవరికి ఎంత పడ్డాయి? వంటి అంశాలపై మంగళవారం నాటికి నిర్ధారణకు వచ్చారు. ప్రధానంగా వృద్ధులు, మహిళలు, పేద, మధ్య తరగతికి చెందిన ఓటర్లు అత్యధికంగా వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు చూపారు. ఇలా మెజార్టీ అంచనాలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుపునే సూచిస్తుండడంతో ఓ నిర్ధారణకు వచ్చిన వీరు బెట్టింగులకు సిద్ధమయ్యారు. సోమవారం వరకు కూటమి గెలుస్తుందని ఊరేగిన వారంతా పోలింగ్ జరిగాక వెనక్కి తగ్గారు. ఇప్పుడు బెట్టింగ్‌లకు అంతగా ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల మాత్రం ఇంకా కూటమిపై ఆశలు పెట్టుకున్న వారు పందాలు కాస్తున్నారు. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో బరిలో నిలిచిన అభ్యర్థులకంటే మళ్లీ ముఖ్యమంత్రి ఎవరన్న దానిపైనే బెట్టింగులకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రూ.లక్షల్లోను, అక్కడక్కడ రూ.కోట్లలోనూ పై అంటున్నారు. ఇంకొన్ని చోట్ల ఏకంగా భూములనే ఫణంగా పెడుతున్నారు. అంతేకాదు.. పందాలు కాసి ఫలితాలు వెలువడ్డాక తేడాలు రాకుండా లిఖిత పూర్వక అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు.

రూ.లక్షల నుంచి కోట్ల వరకు..

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో పందాల సందడి జోరుగా కనిపిస్తోంది. పెందుర్తి నియోజకవర్గంలో కొంతమంది రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు బెట్టింగులకు దిగారు. ఇక్కడ మళ్లీ వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని కొందరు, సిటింగ్ ఎమ్మెల్యే ఆదిప్‌రాజే రెండోసారి గెలుస్తారని పందాలు కాశారు. ఈ నియోజకవర్గంలోని ఓ గ్రామంలో వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు తమ పొంట పొలాలను ఫణంగా పెట్టి పందెం వేశారు. ఆ మేరకు సాక్షుల సమక్షంలో స్టాంపు పేపర్లపై ఒప్పంద పత్రాలు రాసుకున్నారు కూడా. అలాగే భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ, గాజువాక, నర్సీపట్నం తదితర నియోజకవర్గాల్లో పందాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నియోజకవర్గాల్లో కనీసం రూ.లక్ష నుంచి కోటి వరకు పందాలు నడుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థుల మధ్య ఒకింత గట్టి పోటీ ఉన్న చోట్ల ఈ పందాలు మరింతగా కనిపిస్తున్నాయి. అలాంటి నియోజకవర్గాల్లో ఒకటికి రెండింతలు చొప్పున ఇచ్చేలా బెట్టింగులకు సిద్ధమవుతున్నారు. కాగా ఎన్నికల ముందు వరకు పందాలకు కాలు దువ్విన కూటమి శ్రేణులు.. పోలింగ్ తర్వాత వెనక్కి తగ్గారు. అదే సమయంలో గెలుపుపై ధీమాతో ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానులు మాత్రం దూకుడుగా ఉన్నారు.

క్లుప్తంగా

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ అన్వేషికులకు పలు కోర్సుల్లో జూలై 1 నుంచి ఉచితంగా ఏడాది పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ, ఎస్టీ సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంపిటేటివ్ పరీక్షలకు తర్ఫీదు శిక్షణ, 'ఓ'లెవెల్ కంప్యూటర్ ట్రైనింగ్, హార్డ్‌వేర్ ట్రైనింగ్, కంప్యూటర్ అప్లికేషన్, బిజినెస్, అకౌంటింగ్‌లో శిక్షణ, సైబర్ సెక్యూర్ వెబ్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏడాది కాలం శిక్షణ ఉంటుందని, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 30 ఏళ్ల గల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు జూన్ 15లోపు http;//dbtrcrt.ncr.gov.in/urerr/rifnup వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

అనకాపల్లి : ఆటో నుంచి మహిళ జారిపడి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గాజువాక మండలం టి.జి.ఆర్.నగర్‌కు చెందిన కె.లక్ష్మి(44), కుమార్తె కోమలితో కలసి గాజువాక నుంచి అనకాపల్లి మీదుగా తుమ్మపాల వెళ్తుండగా విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తూ ఆటో నుంచి జారి పడిపోయింది. దీంతో లక్ష్మి తలకు తీవ్రగాయం కాగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎ.దుర్గారావు (48) అయ్యన్నపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్లా డు. మార్గమధ్యంలో ఎండ దెబ్బకు రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే సపర్యాలు చేశారు. ఆపై 108కు సమాచారం అందజేశారు. 108 సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

ఎం.కె.వల్లాపురంలో గ్రీన్ పోలింగ్ స్టేషన్



పోలింగ్ స్టేషన్ ఆవరణలో ఓటర్లకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం


ఎం కె.వల్లాపురం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి

మాడుగుల రూరల్ : చోడవరం సామాజిక అటవీశాఖ ఫారెస్టు రేంజ్ అధికారి గౌరీష్ ఆధ్వర్యంలో పోలింగ్ స్టేషన్లను గ్రీన్ పోలింగ్ స్టేషన్లుగా మార్పు చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలో ఎం.కె. వల్లాపురం పోలింగ్ స్టేషన్ గల ఎంపీపీ పాఠశాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. అలాగే రేంజ్ పరిధిలో చోడవరం మండలంలో పి.ఎస్ పేట గ్రామంలో గల పోలింగ్ కేంద్రంలో కూడా చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్టు ఫారెస్టు అధికారి రమణ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది, వన సేవకులు పాల్గొన్నారు.

22న సింహగిరిపై నృసింహ జయంతి

- అదేరోజు నృసింహ హోమం
- ఆన్‌లైన్‌లో టికెట్లు
- ఈవో శ్రీనివాసమూర్తి


ఈవో శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై ఈనెల 22న నృసింహ జయంతిని నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అదేరోజు స్వాతి నక్షత్రం కూడా కావడంతో శ్రీ నృసింహ హోమాన్ని కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఏర్పాట్లపై సింహగిరిపై మంగళవారం దేవస్థానం వైదికులు, అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈసారి నృసింహహోమాన్ని ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. స్వాతి హోమంలో పాల్గొనే భక్తులు్ ల్ఞారు ఇ్వట్ఖ ఇజౌ౨.జీ్ఖ వెబ్‌సైట్‌లోకాని, సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో కానీ టికెట్లు పొందవచ్చని తెలిపారు. స్వయంగా నృసింహహోమంలో పాల్గొనలేని భక్తులు పరోక్షంగా పాల్గొనే అవకాశం ఉందన్నారు. వారు కూడా పైన పేర్కొన్న వైబ్‌సైట్‌లో టికెట్లు తీసుకోవచ్చన్నారు. స్వాతి హోమం టికెట్ ధర రూ.2,500 ఉంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురంలో ఉన్న నృసింహస్వామి విగ్రహం వద్ద కూడా నృసింహ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

చందనోత్సవం విజయవంతం కావడంతో ఈవోకి అభినందనలు

ఈనెల 10న జరిగిన చందనోత్సవం విజయవంతం కావడంతో దేవస్థానం ఉద్యోగులంతా ఈవో శ్రీనివాసమూర్తిని అభినందించారు. సమావేశం అనంతరం ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సమావేశంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యుల, ఈఈ రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, రాజేంద్రకుమార్, నరసింహరాజు, నరసింగరావు, సూపరింటెండెంట్లు అప్పలనాయుడు, వెంకటరమణ, ఎనమండ్ర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికను రద్దు చేయాలి

తుమ్మపాల : ఈ నెల 13న జిల్లాలో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికను రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ ఎంపీ అభ్యర్థి వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. పాయకరావుపేటలోని పార్టీ కార్యాలయం పరివర్తన నిలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ, పాయకరావుపేట ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తున్న తనకు రెండుచోట్ల గాజు గ్లాసును ఎన్నికల గుర్తుగా మొదట కేటాయించి తరువాత ఎంపీ స్థానానికి గాజు గ్లాస్ గుర్తును రద్దు చేయడంతో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఒక పార్టీ అభ్యర్థి రెండు చోట్ల వేర్వేరు గుర్తులు ఎలా కేటాయిస్తారని, ఎంపీ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన సీఎం రమేష్‌కు అనుకూలంగా కేంద్రంలో బీజేపీ, టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్ అధికారుల మీద చేసిన తీవ్రంగా ఒత్తిడి చేసి గాజు గ్లాసు గుర్తును మార్చారన్నారు.

అగ్రకులాల వారు దళితులపై చేస్తున్న దాడికి ఇదే నిదర్శనమన్నారు. ఈ చర్యలపై ఎన్నికల అధికారుల పైన తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కౌంటింగ్ ఆపాలని, తిరిగి ఎంపీ ఎన్నికను నిర్వహించాలని కోరుతూ హైకోర్టుకు ఫిర్యాదు చేస్తామని, తక్షణమే ఎలక్షన్ పిటిషన్ వేస్తామని తెలిపారు. పాయకరావుపేట అసెంబ్లీకి కేటాయించిన గాజు గ్లాస్ గుర్తును ఈవీఎం బ్యాలెట్‌పై చిన్నగా ముద్రించి చూపారని, గుర్తును ఓటర్లు సరిగ్గా గుర్తించకుండా ఉండేలా చేసి తనకు ఓట్లు రాకుండా తీవ్రంగా నష్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు దువ్వాడ దావీదు, జిల్లా యూత్ అధ్యక్షుడు వి.కృష్ణ బాబు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో(ఐటీఐ) 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం https://iti.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా జూన్ 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుంది. నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 20 నుంచి జూన్ 10వ తేదీ లోగా ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్) కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)–ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది)–గాజువాక, ప్రభుత్వ ఐటీఐ–నరవలో వెరిఫికేషన్ చేయించుకుని కౌన్సెలింగ్‌కు అర్హత సాధించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరీలో దరఖాస్తు చేసుకుని విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

పాడేరులో జాతర సందడి

- ఈనెల 19 నుంచి మోదమ్మ ఉత్సవాలు
- చురుగ్గా ఏర్పాట్లు
- ముస్తాబవుతున్న పట్టణం


పాడేరులోని మోదకొండమ్మతల్లి విగ్రహం

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, గిరిజనుల ఇలవేల్పు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఈనెల 19వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి గిరిజన జాతరకు పాడేరు పట్టణం ముస్తాబు అవుతోంది. ఈ ఏడాది కూడా మోదమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు ప్రభుత్వపరంగా సహకారం అందించాలని కలెక్టర్ ఎం.విజయసునీతకు ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, తమర్భ ప్రసాద్‌నాయుడు, శ్రీను, వెంకటరమణ కోరారు. పాడేరు ఐటీడీఏ తరఫున అన్ని విధాల సహకరించేందుకు గాను అధికారులతో ఐటీడీఏ పీవో అభిషేక్ సమావేశాలు నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి పాడేరు పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా సుమారు ఐదు కిలోమీటర్ల పొడవునా విద్యుత్ దీపాల అలంకరణ పనులు జరుగుతున్నాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు తదితరులు పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు


గోకివాడ రెవెన్యూ పరిధిలో మట్టి తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం


కొత్తూరు పరిధిలో స్థలాల్లో మట్టిని తరలించిన దృశ్యం

- యథేచ్ఛగా రవాణా
- ట్రాక్టర్ రూ.1000కు అమ్మకం

రాంబిల్లి : మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. గోకివాడ, కొత్తూరు, మామిడివాడ, మూలజంప పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. యంత్రాల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల సాయంతో లేఅవుట్లు, ఇతర స్థలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టరు మట్టిని రూ 1000 నుంచి రూ 1200 అమ్ముతున్నారు. పంచదార్ల పరిధిలో కంకరను అనుమతులు లేకుండా పగలే గాక రాత్రి వేళల్లోనూ తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా కంకర, మట్టిని తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అధికారుల వ్యవహార శైలి కారణంగానే మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లక్ష్మీపూర్‌రోడ్-టికిరి రెండో లైన్ పనుల పరిశీలన


విండో ట్రయలింగ్ ద్వారా ట్రాక్‌లను పరిశీలిస్తున్న సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్


రెండవ లైన్ పనులను పరిశీలిస్తున్న సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో కె.ఆర్.సెక్షన్‌లో నూతనంగా చేపట్టిన లక్ష్మీపూర్‌రోడ్–సింగారం–టికిరి రెండవ లైన్ పనులను సౌత్ ఈస్ట్రన్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్ మిశ్రా మంగళవాం పరిశీలించారు. ప్రతికూల పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు పనులను విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కోరాపుట్–సింగపూర్ రోడ్ రెండవ లైన్ పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తున్నారు. సేఫ్టీ కమిషనర్‌తో వాల్తేరు అధికారులు విండో ట్రయలింగ్ ద్వారా ట్రాక్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.జి.శ్రీనివాస్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.సస్సస్ వాలా, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ వి.ఎస్.కె రాజ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ అశోక్‌కుమార్, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ విష్ణుమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశాఖ జిల్లాలో పెరిగిన పోలింగ్

- ప్రభుత్వ అనుకూల ఓటు కోసం బారులు తీరిన ప్రజలు
- ఇదే అధికార పక్షం విజయానికి కీలకం

జిల్లాలో మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
20,12,373	14,09,118	70.02

భీమిలిలో అత్యధికం	విశాఖ దక్షిణలో అత్యల్పం	ఓటింగ్ పెరుగుదల	విశాఖ పశ్చిమ అత్యధికం	పెందుర్తి అత్యల్పం
75.96%	63.42%	4.22%	11.64	- 0.36


పెదజాలరిపేటలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గతంతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం ఎక్కువగానే నమోదైంది. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించిన రాజకీయ పక్షాలు.. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా ప్రోత్సహించాయి. ఓటు విలువను తెలుపుతూ ఎన్నికల కమిషన్ నిర్వహించిన ప్రచారం కూడా పోలింగ్ పెరిగేందుకు దోహదపడింది. 2019 ఎన్నికలతో పోల్చి చూస్తే విశాఖ జిల్లాలో 4.22 శాతం పోలింగ్ పెరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. జిల్లా పరిధిలో ఒక్క నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024లో భీమిలిలో 2.06 శాతం పెరిగింది. విశాఖ తూర్పులో 3.91 శాతం, విశాఖ దక్షిణలో 2.27 శాతం, విశాఖ ఉత్తరలో 1.98 శాతం, విశాఖ పశ్చిమలో అత్యధికంగా 11.64 శాతం, గాజువాకలో 4.5 శాతం పోలింగ్ పెరగ్గా.. పెందుర్తిలో మాత్రం 0.36 శాతం తగ్గింది.

పశ్చిమాన 'ఆనందం'

పశ్చిమ నియోజకవర్గంలో భారీగా పోలింగ్ జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 2019 ఎన్నికల్లో కేవలం 58.14 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి మాత్రం సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఖుషీ అయిన ఓటర్లు 'ఆనందం'గా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోటీపడ్డారు. అందుకే జిల్లాలో అత్యధికంగా పోలింగ్ శాతం పెరిగిన నియోజకవర్గంగా విశాఖ పశ్చిమ నిలిచింది.

పార్లమెంట్ పరిధిలోనూ..

అసెంబ్లీ స్థానాలకు దీటుగానే విశాఖ ఎంపీ స్థానానికీ పోలింగ్ గణనీయంగా పెరిగింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తర, గాజువాకతో పాటు శృంగవరపు కోట నియోజకవర్గాలున్నాయి. శృంగవరపు కోట నియోజకవర్గంలో ఏకంగా 85.45 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా విశాఖ ఎంపీ స్థానంలో 19,27,303 మంది ఓటర్లుండగా 13,70,484 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే విశాఖ ఎంపీ స్థానంలో 3.85 శాతం పోలింగ్ పెరిగింది

సాయంకాలం సంబరం

ఉదయం నుంచి కాస్తా నెమ్మదిగా ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల తర్వాత ఊపందుకుంది. ముఖ్యంగా మహిళా ఓటర్లు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. చీకటిపడినా.. వర్షం కురిసినా.. ఏ మాత్రం చెక్కు చెదరకుండా ఓటు హక్కు వినియోగించుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రభుత్వానికి అనుకూల ఓటర్లంతా ఎలాగైనా.. మరోసారి సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టాలన్న కృతనిశ్చయంతో ఓటు వేసినట్లు స్పష్టమవుతోంది. ఇదే అధికార పక్షం ఘన విజయానికి సంకేతాలన్న ట్రెండ్ కనిపిస్తోంది.

విశాఖ పార్లమెంట్ పరిధి	
మొత్తం ఓట్లు	19,27,303
పోలైన ఓట్లు	13,70,484
ఓటింగ్ శాతం	71.11%
2019లో ఓటింగ్ శాతం	67.26%
మొత్తం పురుషులు	9,48,403
ఓటు వేసిన పురుషులు	6,66,289
మొత్తం మహిళలు	9,78,785
ఓటు వేసిన మహిళలు	7,04,154
ఇతరులు	115
ఓటు వేసిన వారు	41

2019లో జిల్లాల వారీగా ఓటింగ్ జరిగిందిలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
భీమిలి	3,05,958	2,26,112	73.90
విశాఖ తూర్పు	2,72,215	1,76,193	64.73
విశాఖ దక్షిణ	2,09,186	1,27,909	61.15
విశాఖ ఉత్తర	2,80,151	1,75,515	62.65
విశాఖ పశ్చిమ	2,36,310	1,38,066	58.14
గాజువాక	3,09,326	2,02,094	65.33
పెందుర్తి	2,68,537	2,00,697	74.74
మొత్తం	18,81,683	12,46,586	65.80

2024లో విశాఖ జిల్లాలో ఓటింగ్ జరిగిందిలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
భీమిలి	3,63,013	2,75,747	75.96
విశాఖ తూర్పు	2,92,206	2,00,563	68.64
విశాఖ దక్షిణ	2,16,770	1,37,474	63.42
విశాఖ ఉత్తర	2,85,789	1,84,703	64.63
విశాఖ పశ్చిమ	2,13,439	1,48,942	69.78
గాజువాక	3,33,611	2,32,949	69.83
పెందుర్తి	3,07,545	2,28,740	74.38
మొత్తం	20,12,373	14,09,118	70.02

క్లుప్తంగా

మూడు చోట్ల ఈవీఎంల మొరాయింపు

మునగపాక: మండలంలోని మూడు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఆయా కేంద్రాల్లో పోలింగ్ ఒకింత ఆలస్యమైంది. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లు కొంత అసహనానికి గురయ్యారు. సకాలంలో ఓటు వేసే పరిస్థితులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పిల్లలతో వచ్చిన వారు, వృద్ధులు కూడా గంటల కొలది పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వచ్చింది. మండలంలోని టి.సిరసపల్లి, గొల్లలపాలెం, పల్లపు ఆనందపురం పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఈవీఎంలు మొరాయించాయి. అప్పటికే పెద్దసంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లంతా అవస్థలు పడ్డారు. సంబంధిత అధికారులు సాంకేతిక సమస్యను అధిగమించి తిరిగి ఓటింగ్ ప్రక్రియ వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు. కాగా సిరసపల్లి -149 కేంద్రంలో రాత్రి 9.45 గంటలకు పోలింగ్ ముగిసింది.మొత్తం మీద ఈవీఎంల మొరాయింపుతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు కొన్ని ఇబ్బందులు పడ్డారనడంలో సందేహం లేదు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 12వసాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.వి.వి.ఎం.మోహన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి 25 శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు హాజరుకాలని ఆయన కోరారు.

ఎనిమిది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు


కంటి ఆపరేషన్ రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏఎల్ రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్టు రోటరీ ప్రతినిధి రవిరామ్ జవహర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 23 మందికి కంటి పరీక్షలు చేసినట్టు తెలిపారు. వీరిలో ఎనిమిది మందిని ఎంపిక చేసి,డాక్టర్ కె.మల్లేశ్వరరావు ఐఓఎల్ కంటి ఆపరేషన్లు చేసినట్టు ఆయన చెప్పారు. ఆపరేషన్ అనంతరం ఐదు రోజులకు సరిపడే మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోగులు, నేత్ర వైద్యసహాయకురాలు పి.దేవి పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
లక్ష్మీకటాక్షం	: సత్యనారాయణస్క్రీన్-1
కింగ్‌డమ్‌ప్లానెట్	
అఫ్ ఏపీఈఓస్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
ప్రతినిధి	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,405 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,290	4,950
మొదటి రకం	4,300	5,000
రెండో రకం	3,770	4,340
మూడో రకం	3,450	3,730

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-13 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 458 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 392 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ను సంప్రదించవచ్చు.

ఓటెత్తిన మహిళా లోకం

- పెద్ద ఎత్తున ఓట్లు వేసిన పడతులు
- వారి తీర్పే కీలకం


అనకాపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో మహిళలు అత్యధికంగా ఓట్లు వేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి భారీ సంఖ్యలో మహిళా ఓటింగ్ నమోదైంది. యలమంచిలి నియోజవర్గంలో పురుషుల కంటే 4,177 మంది, అనకాపల్లి నియోజకర్గంలో 5,756 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళా ఓట్లు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో కీలకంగా మారనున్నాయి. ముందెన్నడు లేని విధంగా అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం తమకు లాభిస్తుందా, ప్రత్యర్థులకు ఉపయోగపడుతుందా అనే కోణంలో అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. పురుషుల కంటే అధిక సంఖ్యలో మహిళా ఓటు పోలవడం ఎవరికి మేలు అన్న విషయంలో అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు.

అనకాపల్లిలో 74.64 శాతం పోలింగ్

తుమ్మపాల : అనకాలపల్లి నియోజక వర్గంలో గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈసారి 2.90 శాతం ఓటింగ్ తగ్గింది. ఈ సారి నియోజకవర్గంలో మహిళలు పెద్ద ఎత్తున ఓట్లు వేశారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 2,13,714 ఓట్లకు గానూ, 1,59,523, ఓట్లు పోలయ్యాయి. ఈ మేరకు 74.64 శాతం పోలింగ్ శాతం నమోదయింది. మొత్తం ఓటర్లలో పురుషులు 76,878 మంది ఓటు వేయగా, మహిళలు 82,634 మంది ఓటు వేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో(2019)లో 2,04,699 ఓట్లకు గాను 1,58,722 ఓట్లు పోలయ్యాయి.ఈ మేరకు గత ఎన్నికల్లో 77.54 శాతం నమోదయింది. నియోజకవర్గంలో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.పోటీలో ప్రధాన అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

యలమంచిలిలో 85.66 శాతం

అచ్యుతాపురం: యలమంచిలి నియోజక వర్గంలో గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈ విడత 1.17 శాతం ఓటింగ్ పెరిగింది. ఈ సారి నియోజకవర్గంలో మహిళలు పెద్ద ఎత్తున ఓట్లు వేశారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 2,06,394 ఓట్లకు గానూ, 1,76,807 ఓట్లు పోలయ్యాయి. ఈ మేరకు 85.66 శాతం పోలింగ్ శాతం నమోదయింది. మొత్తం ఓటర్లలో పురుషులు 86,315, మంది ఓటు వేయగా, మహిళలు 90,492 మంది ఓటు వేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో(2019)లో 1,97,602 ఓట్లకుగాను 1,66,954 ఓట్లు పోలయ్యాయి.ఈ మేరకు గత ఎన్నికల్లో 84.49 శాతం నమోదయింది. గత ఎన్నికల్లో యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు 4,146 ఓట్ల మెజారిటీతో గెలిచారు.నియోజక వర్గంలో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.పోటీలో ప్రధాన అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లస్సా..మైనస్సా..?


యలమంచిలి బ్రిడ్జి స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు క్యూలో నిలుచున్న మహిళలు,పురుషులు

- పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు
- బూత్‌ల వారీగా పరిస్థితిపై అంచనా
- బిజీబిజీగా నాయకులు,కార్యకర్తలు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- భవితవ్యాన్ని తేల్చేది మహిళా ఓటర్లే

యలమంచిలి రూరల్: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. గతం కంటే ఓటింగ్ శాతం పెరగడంతో ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారే లెక్కలేసుకుంటున్నారు.తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గంలో 85.66 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,06,394 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,76,807 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 86,315 మంది, మహిళలు 90,492 మంది ఓటు వేశారు.

లెక్కల్లో మునిగిన నేతలు..

పోలింగ్ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు చేరడంతో ప్రధాన పార్టీల నేతలంతా లెక్కల్లో మునిగి తేలుతున్నారు.తమ అభ్యర్థులకు ఏయే గ్రామాల్లో ఎన్ని ఓట్లు వచ్చాయో అనే అంచనా వేసుకుంటున్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ,జనసేన నేతలు మంగళవారం గ్రామాల వారీగా పోలైన ఓట్లు వివరాలను సేకరించి అందులో తమకు ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయని లెక్కలు రాసుకుంటున్నారు.ఏయే గ్రామాల్లో తమకు బలముందో చూసుకుంటూ తమకు లీడ్ వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఏ పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓట్లు వస్తాయి. ప్రత్యర్థి పార్టీకి ఎన్ని పోలై ఉంటాయనే అంచనా వేసుకుంటున్నారు.ప్రధాన పార్టీల నాయకులంతా ఇలా లెక్కలేసుకుంటూ తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఓట్లే అధికంగా పోల్..

యలమంచిలి నియోజకవర్గంలో పోలింగ్ ముగిసే సమయానికి 1,75,807 ఓట్లు పోల్ కాగా అందులో పురుషులు 86,315 మంది,మహిళలు 90,492 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.పురుషుల కంటే 4,177 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు.ఈ లెక్కన అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళల ఓట్ల శాతం కీలకం కానుంది.మహిళా ఓటర్లు పార్టీవైపు మొగ్గు చూపితే ఆ పార్టీ అభ్యర్థికే విజయావకాశాలు ఉన్నట్టు రాజకీయపార్టీల నేతలు అంచనా వేస్తున్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులు నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేశారు.దీంతో వారంతా అధికార వైఎస్సార్‌సీపీకే మద్దతునిచ్చారని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.మహిళా ఓటర్ల నిశ్శబ్ద విప్లవం తమను గెలుపు తీరాలకు చేర్చుతుందన్న అంచనా వైఎస్సార్‌సీపీ నేతల్లో ఉంది.నిజానికి మహిళలంతా ఎవరికి పట్టం కట్టనున్నారో వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపులో తేలనుంది.

మునగపాకలో 86.9 శాతం ఓటింగ్

మునగపాక: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 86.9 మేర ఓటింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. గతంలో కన్నా ఈ ఏడాది ఓటింగ్ శాతం పెరిగిందని డీటీ వినయ్ కుమార్ తెలిపారు. మొత్తం 45,414 ఓటర్లకు గాను 39,499 మంది ఓట్లు వేశారు. గ్రామాల వారీగా పోల్ అయిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. చెర్లోపాలెంలో 800 ఓట్లకు గాను 676 ఓట్లు, రామగిరిలో 543 గాను 511 , మడకపాలెంలో 550 గాను 479, మెలిపాకలో 1,697 గాను 1,495, చూచుకొండలో 2,271 గాను 1,926, గణపర్తిలో 1,799 గాను 1,554, గంటవానిపాలెంలో 706 గాను 629 ఓట్లు, పురుషోత్తపురంలో 265 గాను 242, పల్లపు ఆనందపురంలో 1047 గాను 888,అరబుపాలెంలో 1,392 గాను 1,259, ఒంపోలులో 1,616 గాను 1,492, నాగులాపల్లిలో 4,847గాను 4,116, ఉమ్మలాడలో 2,023గాను 1,579, తోటాడలో 1,784గాను 1,466, గవర్ల అనకాపల్లిలో 1,617 గాను 1,430, తోటాడ సిరసపల్లిలో 2,139 ఓట్లకు గాను 187 ఓట్లు పోలయ్యాయి, వెంకటాపురంలో 884 ఓట్లకు గాను 823, పాటిపల్లిలో 1,519 ఓట్లకు గాను 1,317 , నారాయుడుపాలెంలో 1,377 ఓట్లకు గాను 1,217,నాగవరంలో 1,509 ఓట్లకు గాను 1,371, మల్లవరంలో 766 ఓట్లకు గాను 720, కాకరాపల్లిలో 729 ఓట్లకు గాను 643, వాడ్రాపల్లిలో 1,314 ఓట్లకు గాను 1,202,గొల్లలపాలెంలో 574 ఓట్లకు గాను 551, తిమ్మరాజుపేటలో 1,796 ఓట్లకు గాను 1,582, మునగపాకలో 7,609 ఓట్లకు గాను 6,209,మూలపేటలో 956 ఓట్లకు గాను 861,గంగాదేవిపేటలో 322 ఓట్లకు గాను 290 ఓట్లు పోలయ్యాయి.

మెజార్టీ ఓటర్లంతా వైఎస్సార్‌సీపీ వైపే...

మునగపాక: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ వైపు ఓటర్లు మొగ్గు చూపినట్టు తెలిసింది.ఉదయం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారు.మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.కాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పలు పథకాల ద్వారా లబ్ధి పొందిన వారంతా వైఎస్సార్‌సీపీ వైపే ఓటు వేసినట్లు స్పష్టంగా పోలింగ్ సరళిని బట్టి తెలుస్తుంది. జనసేన,టీడీపీ, బీజేపీలు ఎన్ని కుతంత్రాలకు పాల్పడినా ప్రజలు మాత్రం జగన్ వెంటే ఉన్నారనడంలో సందేహం లేదు. 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు అలాగే పలు రకాల పింఛన్‌లు పొందిన లబ్ధిదారులు కూడా తాము పొందిన లబ్ధిని గుర్తించి ఇతర పార్టీలు ప్రలోభాలకు గురి చేసినా వారి మాటలను కాదని మెజార్టీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేచినట్లు స్పష్టంగా తెలుస్తుంది. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్న ఆశయం ఎక్కువ సంఖ్యలో ఓటర్లలో కనిపించింది. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను నమ్మలేదని తెలుస్తుంది. మొత్తం మీద మునగపాక మండలంలో అత్యధిక ఓటర్లు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని పరిశీలకులు భావిస్తున్నారు.

కశింకోటలో 79.82 శాతం పోలింగ్

కశింకోట: మండలంలో మొత్తం 54,487 ఓటర్లు ఉండగా, 79.82 శాతం మేర పోలైనట్టు అధికారవర్గాల సమాచారం. మండలంలోని పలు శివారు గ్రామాలకు చెందిన ఓటర్లు 2 నుంచి సుమారు 5 కిలో మీటర్ల వరకు దూరం నుంచి తమ పోలింగ్ కేంద్రానికి ఆటోలు, వ్యాన్లలో చేరుకుని ఉత్సాహంగా ఓట్లు వేశారు. తీడ గ్రామానికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరం ఉన్న శివారు కప్పుల్లపాలెం, రెండు కిలోమీటర్ల దూరం ఉన్న మరో శివారు రెడ్డివానిపాలెం, శివారు పాత కన్నూరుపాలెం, కిలో మీటరు దూరం ఉన్న ఇంకో శివారు మేడిశెట్టివానిపాలెం గ్రామాల నుంచి తీడ వచ్చి ఓట్లు వేశారు. రెండు కిలో మీటర్ల దూరం ఉన్న శివారు రెడ్డివానిపాలెం గ్రామస్తులు చెరకాంలోను, కన్నూరుపాలెంలో శివారు పాత కన్నూరుపాలెం గ్రామస్తులు, అచ్చెర్లలో శివారు గమినిపేట, కొత్త అచ్చెర్ల గ్రామాల నుంచి వచ్చి ఓట్లు వేశారు. నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెం ప్రజలు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న అచ్యుతాపురం వెళ్లి ఓట్లు వేయగా, ఏనుగుతునిలో శివారు చిన ఏనుగుతుని నుంచి రెండు కిలో మీటర్ల దూరం నుంచి వచ్చి ఓట్లు వేశారు. సుందరయ్యపేటలో శివారు ఆనందపురం నుంచి 2 కిలో మీటర్ల దూరం నుంచి ఓట్లు వేశారు. బయ్యవరంలో రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న రైల్వే కాలనీ నుంచి ఓటర్లు వచ్చి ఓటు వేశారు. బయ్యవరం, సుందరయ్యపేట పోలింగ్ బూత్‌లలో ఎక్కువ శాతం ఓట్లు ఉండటం, ఈవీఎంలు సరిగ్గా పని చేయడపోవడంతో రాత్రి పది గంటల వరకు పోలింగ్ కొనసాగింది, దీంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

టీడీపీకి క్రాస్ ఓటింగ్ బెంగ

నక్కపల్లి : ఈ దఫా జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట మండలంలో ఎక్కువగా క్రాస్ ఓటింగ్ జరిగిందన్న ప్రచారం బాగా జరుగుతోంది. టీడీపీ, జనసేన పార్టీల్లో ఉన్న వర్గాలు, టీడీపీలో అసంతృప్తులు టీడీపీ తరపున పోటీ చేసిన అనిత గెలుపునకు పనిచేయలేదన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. జనసేనలో ఒక వర్గం, టీడీపీలో ఒక వర్గం ఎంపీ ఓటు బీజేపీకి వేసి అసెంబ్లీకి మాత్రం వైఎస్సార్‌సీపీకి వేసినట్టు చెప్పుకుంటున్నారు. ఎక్కువగా కాపు సామాజిక వర్గం ఉన్న గ్రామాల్లో ఈ క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగినట్టు తెలుస్తోంది. తెలుగుదేశం, జనసేన పార్టీల్లో వంగలపూడి అనితతో ఎడముఖం పెడముఖంగా ఉన్న వారంతా ఎన్నికల ముందు కలిసి పనిచేస్తున్నట్టు ప్రచారం జరిగినప్పటికీ పోలింగ్ రోజు మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసే విషయమై టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య గొడవలు జరిగాయి. గ్రామాల్లో డబ్బులు సరిగా పంపిణీ చేయలేదని టీడీపీ అభ్యర్థికి ఫిర్యాదు చేసిన ఒకరిద్దరు బీజేపీ నాయకులపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారని వార్తలు గుప్పుమన్నాయి. దీంతో బీజేపీ నాయకులు కమలం గుర్తుకు ఓటేసి సీఎం రమేష్‌ను గెలిపించాలని మాత్రమే ప్రచారం చేసినట్టు తెలుస్తోంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి ఖర్చంతా సీఎం రమేష్ భరించాడని తెలుస్తోంది. మీ గ్రూపుల పోరు ఎలా ఉన్నా ఎంపీగా రమేష్ మాత్రం గెలవాలని ఆయన వర్గీయులు టీడీపీ, జనసేన పార్టీల్లో అసమ్మతి నేతలపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. దీంతో జనసేన, బీజేపీ వారు డబ్బులు పంపిణీ సమయంలో కేవలం బీజేపీ గుర్తు కమలానికి వేయాలని మాత్రమే ఎక్కువగా ప్రచారం చేసినట్టు తెలుస్తోంది.

ప్రతిభ చూపిన టెన్త్ విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న పెతకంశెట్టి శివసత్యనారాయణ జోసెఫ్

అనకాపల్లి: విద్యార్థి దశనుంచి ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ అధ్యక్షుడు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ జోసెఫ్ అన్నారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన వారికి స్థానిక వైఎంవీఏ హాల్లో మంగళవారం రాత్రి సత్కరించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కరణం సంజన(588), ఎం.వరుణ్ సందీప్(587), కె.జె.రాజ్(586)లను నగదు ప్రోత్సాహం, దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంతనిధులతో విద్యా, వైద్య రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. పదో తరగతి ఫలితాలు విడుదలైన వెంటనే ఈ కార్యక్రమం నిర్వహించాలనుకున్నప్పటికీ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని వాయిదా వేసినట్టు తెలిపారు. ఎన్నికల అయిన తరువాత సత్కరించినట్టు చెప్పారు. హైస్కూళ్లకు వెళ్లి ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులను ఆగస్టు 15 వ తేదీ లోపు సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బాలికోన్నత పాఠశాల తెలుగు పండితురాలు వి.ఆర్.రాజేశ్వరిదేవి, సీనియర్ ఉపాధ్యాయులు మారిశెట్టి వెంకటఅప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు వెలగా కాశీపతి, కుంచం నూకయ్యశెట్టి, వినకోట బుచ్చిరాజు, పూసర్ల నర్సింగరావు, పెతకంశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు వచ్చేంతవరకు అమలులో కోడ్

మునగపాక: సార్వత్రిక ఎన్నికలు పూర్తయినా ఫలితాలు వచ్చేంత వరకూ కోడ్ అమలులో ఉంటుందని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడైనా రాజకీయ గొడవలకు దిగితే కేసులు తప్పవన్నారు. అలాగే 144వ సెక్షన్ కూడా అమలవుతుందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

వేసవి తాపంతో విలవిల

కశింకోట: వేసవి తాపంతో మండల ప్రజలు మంగళవారం విలవిలలాడారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎక్కువ శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోడ్లు నిర్మానుష్యమయ్యాయి.

వైభవంగా చినపైడితల్లమ్మ పండగ


చెక్క గుర్రాల ఊరేగింపులో గ్రామస్తులు

కె.కోటపాడు: చౌడువాడలో చిన పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఇక్కడ అమ్మ వారి పండగ పర్వదినం కావడంతో ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పండగలో భాగంగా సాయంత్రం చెక్క గుర్రాలను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది.

నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం


గౌరీపరమేశ్వరులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి గరికి వెంకటరావు, మద్దాల కూర్మారావు మంగళవారం తెలిపారు. మెయిన్‌రోడ్డు రహదారి విస్తరణలో సుమారుగా 15 సంవత్సరాల క్రితం అమ్మవారి ఆలయాన్ని తొలగించారని, ఆలయ వెనుకభాగాన ఉన్న స్థలం వ్యక్తి సాయంతో అమ్మవారి గర్భగుడిని మూడు సంవత్సరాల పునఃనిర్మించినట్టు చెప్పారు. ఈ ఆలయానికి సుమారు 170 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు.

వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం సుమారుగా 10వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 6 గంటలకు గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు రేజేటి అప్పలచార్యులు(చక్రవర్తి)వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు కమిటీవారిని సంప్రదించి పేర్ల నమోదు చేసుకోవాలన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


బార్ అసోసియేషన్ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్

అనకాపల్లి: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్ తెలిపారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో మంగళవారం ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి సందీప్, ఉపాధ్యక్షుడు రోజా, సహాయ కార్యదర్శి తులసి, స్పోర్ట్స్ కార్యదర్శి మోహన్, లైబ్రేరియన్ ప్రతినిధి జగపతి, మహిళా ప్రతినిధి కుసుమతో పాటు మరో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కోర్టు కొత్త భవనం నిర్మాణ కోసం సీనియర్ లాయర్లను అందరినీ సమన్వ యం చేసుకుంటూ చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పూతదశలో బరబాటి సాగు


రామచంద్రపురంలో బరబాటి సాగు

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో బరబాటి సాగు ఆశాజనకంగా ఉంది. మూడు నెలల కాలంలో చేతికందివచ్చే పంట కావడంతో బరబాటిని రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సాగవుతున్న బరబాటి పంట ప్రస్తుతం పూతదశలో ఉంది. నీటి లభ్యత ఉన్న పొలాల వద్ద కింతాడ, జోగన్నపాలెం , రామచంద్రపురం, మర్రివలస, లంకవానిపాలెం, పిండ్రంగి, కె.సంతపాలెం, ఆర్లి, ఎరకన్నపాలెం, దాలివలస, కె.సంతపాలెం గ్రామాల్లో 40 ఎకరాలలో సాగు చేస్తున్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

రోలుగుంట: కోమరవోలులో పరదేశమ్మ పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆకాశం మిరుమిట్లు గొలిపేలా బాణసంచా కాల్చారు.

బోసిపోయిన కార్యాలయాలు

ఎస్.రాయవరం : సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పూర్తయిన తరువాత గ్రామాలు నిశ్శబ్దంగా మారిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు ఇవ్వడంతో కార్యాలయాలు మూతపడ్డాయి. అసలే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బయటకు రాని ప్రజలు, సెలవు రోజు కావడంతో మండలంలో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మంగళవారం ఎండ తీవ్రత కూడా ఎక్కువగా నే ఉంది.

రావికమతం మండలంలో 83.38 శాతం పోలింగ్


రావికమతంలో రాత్రి క్యూలో నిలుచుకున్న ఓటర్లు

రావికమతం: మండలంలో ఈ ఏడాది పోలింగ్ శాతం అధికంగా పెరిగింది. మొత్తం 83.38 శాతం నమోదైందని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణారావు తెలిపారు. గత ఎన్నికల్లో 80.30 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 3 శాతం పెరిగిందన్నారు. మండలంలో ప్రస్తుతం 55,709 మంది ఓటర్లు ఉండగా, 46,367 మంది ఓటు వేశారన్నారు. 28 పంచాయతీల్లో 61 పోలింగ్ బూత్‌లు ఉండగా, వీటిని ఆరు క్లస్టర్లుగా విభజించామన్నారు. మొదటి క్లస్టర్‌లో 11,403 ఓటర్లకు గానూ 8,952 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. 2వ క్లస్టర్‌లో 10,093కు 8,683 ఓట్లు, మూడో క్లస్టర్‌లో 9,093కు 7,010 ఓట్లు, నాల్గో క్లస్టర్‌లో 10,483 ఓట్లకు 9,168 ఓట్లు, ఐదో క్లస్టర్‌లో 9,777 ఓట్లకు 8,435 ఓట్లు, ఆరో క్లస్టర్‌లో 4,860 ఓట్లకు 4,119 ఓట్లు పోలయ్యాయన్నారు. రావికమతం, మేడివాడ, చినపాచిల, మత్స్యవానిపాలెం, కొత్తకోట, తట్టబంద తదితర 11 గ్రామాల్లో సోమవారం రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగిందన్నారు. అయినప్పటికీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు.